ఏజెన్సీలో ఓటు చైతన్యం

- వాజేడులో అత్యధికంగా 88 శాతం
- అత్యల్పంగా భద్రాచలంలో 60 శాతం



దుమ్ముగూడెం మండలం గంగోలు పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

భద్రాచలం: పట్టణప్రాంత ప్రజల కంటే మారుమూల ఉన్న ఏజెన్సీ గ్రామాల ప్రజలే చైతన్య వంతులని మరోసారి నిరూపించారు. రహదారి సౌకర్యాలు లేకపోయినప్పటికీ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు పోలింగ్ బూత్‌లలో బారులుదీరారు. శుక్రవారం జరిగిన ఎన్నికలలో భద్రాచలం నియోజకవర్గంలోని వాజేడు మండలంలో అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదు కావడం విశేషం. అత్యల్పంగా భద్రాచలం మండలంలో నమోదయింది. పట్టణ ప్రాంత ప్రజలు 'నోట్ల'పై పెట్టిన శ్రద్ధ 'ఓట్ల'పై పెట్టలేదని నమోదయిన గణాంకాలు రుజువు చేస్తున్నాయి. కాగా 2018 ఎన్నికలలో నియోజకవర్గంలో నమోదైన ఓట్ల శాతంతో పోలిస్తే ఈసారి రెండు శాతం తగ్గింది.

ఫలించిన పోలీస్ ప్రణాళికలు..

దుమ్ముగూడెం : మావోయిస్టు ప్రభావిత మండలమైన దుమ్ముగూడెం మండలంలో పోలింగ్ ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా జరగడంలో మండల పోలీసుల కృషి ఎనలేనిది. జిల్లా బాస్ డాక్టర్.వినీత్ జి, భద్రాచలం, ఏఎస్పీ పరితోజ్ పంకజ్ ఆదేశాల మేరకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి మండల సీఐ దోమల రమేష్, ఎస్సైలు కేశవరావు, పాటు గణేష్‌లు తీసుకున్న చర్యలతో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నేరచరిత కలిగిన వారిని ముందస్తుగా బైండోవర్ చేస్తూ వారికి కౌన్సిలింగ్ ఇస్తూ చర్యలు చేపట్టడం ఎంతో ఉపయోగకరమైంది. మండలంలోని 40 పోలింగ్ కేంద్రాల దగ్గర సీఆర్పీఎఫ్ బలగాలతో పాటు సివిల్ పోలీసులతో భద్రత చర్యలు చేపడుతూ సరిహద్దు అటవీ ప్రాంతంలో స్పెషల్ పార్టీ, సీఆర్పీఎఫ్ బలగాలతో నిత్యం కూంబింగ్ నిర్వహిస్తూ పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నికల కమిషన్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించాలనే ఆదేశాలు జారీ చేసినా పోలీసులు చేపట్టిన భద్రతా చర్యల వలన సరిహద్దు గ్రామాలైన కొత్తపల్లి, ఆర్లగూడెం, పైదిగూడెం పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మండలం	ఓట్లు	నమోదైనవి	శాతం
వాజేడు	18,681	16,458	88.10
దుమ్ముగూడెం	34,658	30,064	86.74
వెంకటాపురం	24,500	20,694	84.47
చర్ల	31,236	26,216	83.93
భద్రాచలం	39,586	24,015	60.67
మొత్తం	1,48,661	1,17,447	79

ఓటింగ్‌లో ఆదర్శ పల్లెలు..!



అశ్వారావుపేటలో క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం అత్యధికంగా పల్లె ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో నమోదు కాగా, మండల కేంద్రాల్లో ఓటింగ్ నమోదులో వెనుకబడ్డాయి. దీంతో పల్లె ప్రాంతాల్లోని ఓటర్లలో చైతన్యం వెల్లు విరిసినట్లైంది.

అశ్వారావుపేట నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 1,55,961 మంది ఓటర్లు కాగా, 1,35,501 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 184 పోలింగ్ కేంద్రాలలో నమోదైన ఓటింగ్‌లో అత్యధికంగా ములకలపల్లి 89.82 శాతం నమోదవ్వగా, అత్యల్పంగా అశ్వారావుపేటలో 83.69 శాతం నమోదైంది.

ఆ కేంద్రాల్లో 95 శాతంపైనే..

ఓటింగ్ నమోదులో చిన్న, చిన్న పల్లె ప్రాంతాలు పోటీలు పడ్డాయి. గిరిజన గ్రామాల్లోని 8 పోలింగ్ కేంద్రాల్లో 95 శాతంపైనే ఓటింగ్ నమోదైయింది. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మండలంలోని వడ్డెర రంగాపురంలోని అత్యధికంగా 95.04శాతం, దమ్మపేట మండలంలోని రెడ్యాలపాడు బూత్ నంబర్ 88లో 96.25 శాతం, 87లో 95.33, చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెంలో 95.02శాతం, గంగ్రిపోలు కేంద్రంలో 95.85శాతం, అశ్వారావుపేట మండలంలోని వడ్డెర రంగాపురంలో 95.04శాతం, కాగా, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో అధికంగా గిరిజనులే ఉన్నారు. 88 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికిపైగానే రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు కావడం విశేషం.

మండలం	పోలింగ్ శాతం
ములకలపల్లి	89.82
చంద్రుగొండ	88.26
దమ్మపేట	87.88
అన్నపురెడ్డిపల్లి	86.37
అశ్వారావుపేట	83.69
మొత్తం	86.88

అధికశాతం అతివలే...

- పినపాకలో 80.13శాతం పోలింగ్



మణుగూరులో బారులుదీరిన ఓటర్లు(ఫైల్)

మణుగూరు టౌన్: పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా 80.13 పోలింగ్ శాతం నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓటర్ల వారిగా మండలాల్లో పోలైన వివరాలు వెల్లడించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలే అధికశాతం ఓటు వినియోగించుకున్నట్టు పేర్కొన్నారు. ఏడు మండలాల్లోని 1,98,402 మంది ఓటర్లకు గాను 1,58,978 మంది ఓటర్లు పినపాక నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకుని 80.13 శాతంగా ఓట్లు పోలయ్యినట్లు తెలిపారు. వారిలో పురుషులు 78,530 కాగా మహిళలు 80,446 మంది ఉన్నారన్నారు. అత్యధికంగా ఆళ్లపల్లి మండలంలో 89.90 శాతం పోలింగ్ నమోదవ్వగా, అత్యల్పంగా అశ్వాపురంలో 67.53 నమోదైనట్టు తెలిపారు.

మండలాల వారీగా..

ఆళ్లపల్లి మండలంలో 9,202 మంది ఓటర్లకు గాను 8,273 మంది వినియోగించుకున్నారు. అశ్వాపురంలో 34,443 మందికి గాను 23,259 మంది, బూర్గంపహాడ్‌లో 43,272 మందికిగాను 36,115 మంది, గుండాలలో 12,934 మంది ఓటర్లకు గాను 10,855 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కరకగూడెం మండలంలో 11,496 మంది ఓటర్లకు గాను 8,798 ఓట్లు పోలవగా, మణుగూరులో 54,250 ఓట్లకుగాను 45,179 పోలయ్యాయి. పినపాక మండలంలో 32,805 మంది ఓటర్లకు గాను 25,518 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

మండలం	పోలింగ్ శాతం
ఆళ్లపల్లి	89.90
గుండాల	83.93
బూర్గంపాడు	83.46
మణుగూరు	83.28
పినపాక	77.79
కరకగూడెం	76.53
అశ్వాపురం	67.53
మొత్తం	80.13

లేబర్‌కార్డులు ఉండాలి

దుమ్ముగూడెం : మండలంలోని ఎలక్ట్రీషియన్స్ అందరి దగ్గర లేబర్ కార్డులు ఉండాలని మండలాధ్యక్షుడు రాయపూడి సూరిబాబు సూచించారు. శుక్రవారం ములకపాడు గ్రామంలో జరిగిన మండల తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ఎలక్ట్రీషన్ వృత్తి చేసే వారందరూ కూడా కలిసికట్టుగా ఉండి యూనియన్‌ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ముక్కెర రాంబాబు, అబ్బులు ముక్కర పృథ్వీ, పూనం ప్రభాకర్, వందవాసు ప్రవీణ్, గోపి, రామకృష్ణ, ఆకుల సతీష్, కరుణాకర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు

కష్టపడినవారికి ధన్యవాదాలు..



మణుగూరు టౌన్: మాట్లాడుతున్న పాయం

మణుగూరు టౌన్: కాంగ్రెస్ పార్టీ తరపున అహర్నిషలు కృషి చేసి ప్రచారంలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు పినపాక పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం పాయం నివాసంలో జరిగిన నాయకుల సమీక్షా సమావేశంలో 30వ తేదీన జరిగిన పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సరళిపై నిష్పత్తిపై వివరాలు తెలుసుకున్నారు. ఈవీఎంలు మొరాయించడంతో అధికారులు వెంటనే వచ్చి సమస్యలు పరిష్కరించిన తీరును, విప్పలసింగారంలో జరిగిన దాడితో పాటు రాయిగూడెం వద్ద కార్యకర్తలకు వాగ్వాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు కేవీరావు, సామా శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల శంకర్, నామా వెంకటేశ్వర్లు, ఆవుల సర్వేశ్వరరావు, కూచిపూడి బాబు, దొబ్బల వెంకటప్పయ్య, సుబ్బారెడ్డి, పెనుగొండ సాంబశివరావు, బోగినేని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారంలో పాల్గొని, కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉండి సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పడిన కష్టం మరవలేనిదని పేర్కొన్నారు.

గెలుపునాదే..

అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తానే గెలుస్తానని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్దిరోజులుగా ప్రచారంలో తన వెన్నంటే వుండి, పూర్తి సహాయ సహకారాలు అందించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

తీరిన రోడ్డు కష్టాలు..



మొండికుంట-తుమ్మలచెరువు రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట నుండి గొందిగూడెం మీదుగా అశ్వాపురం వరకు ఎన్నో ఏళ్లుగా రహదారి గుంతలమయమై ప్రయాణానికి 20 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మేరకు మొండికుంట నుండి గొందిగూడెం మీదుగా అశ్వాపురం వరకు బీటీ రోడ్డుకు రూ.6 కోట్లు మంజూరు కావడంతో రహదారి పనులు తుది దశకు చేరుకున్నాయి. రహదారిపై ప్రయాణం సులువు కావడంతో గిరిజనులకు రహదారి కష్టాలు తీరనున్నాయి.

కాంగ్రెస్‌దే విజయం..

చంద్రుగొండ : రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని పార్టీ నాయకులు సారేపల్లి శేఖర్ అన్నారు. చంద్రుగొండలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంతో విసిగి పోయారని, ఈ క్రమంలోనే మార్పు కోరుకున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బాణోత్ రాముడు, ఎండి.జాకీర్, భీలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహమ్మారిని నిర్మూలిద్దాం..



అశ్వారావుపేటరూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల ఏడీ డాక్టర్ హేమంత్ కుమార్



గుండాల: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ప్రాణాంతకమైన ఎయిడ్స్ మహమ్మారిను నిర్మూలించాల్సిన అవసరం ఏంతైనా ఉందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్లు జయమ్మ, నాగాంజలి, పీ.రెడ్డిప్రియ, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని గుండాల, ఆళ్లపల్లి వైద్యాధికారులు ప్రియాంక, రేవంత్‌లు అన్నారు. గుండాల, ఆళ్లపల్లి మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ ప్రతీ రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. కస్తూర్బా ప్రిన్సిపాల్ శ్రావణ సంధ్య, హెచ్‌వీ పద్మ, సూపర్‌వైజర్లు రమేష్, ఎమ్‌టీస్ సత్యం, ఏఎన్ఎంలు భువనేశ్వరి, అరుణ, రమా, అనసూర్య, ధన, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



చంద్రుగొండ: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ..

చంద్రుగొండ: చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు కనకం తనుజ, వెంకటప్రకాష్, ఎస్ఎస్ లక్ష్మిప్రసన్న, సిబ్బంది ఇమాం, పద్మ, జ్యోతి, లక్ష్మి, చంద్రకళ, సుజాత, శ్రీను పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

భద్రాచలంఅర్బన్: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఎయిడ్స్ నివారణకు సంబంధించి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆర్ఎంఓ రాజశేఖర్, నోడల్ ఆఫీసర్ తేజస్విని, వైద్యులు గాదె పావని రెడ్డి, మాధూరి, చంద్ర ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కాంతమ్మ, ముత్యాలరావు, డీపీఎంఓ, సెక్యూర్, ఎన్జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మణుగూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవిద్య జూనియర్ కళాశాలల్లో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలల్లో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. లాయర్లు బద్దం శ్రీనివాసరెడ్డి, వాసవీ, ప్రవళికారాణి తదితరులు ఉన్నారు.

ములకలపల్లి : ఎయిడ్స్ మహమ్మారిని పారద్రోలుదామని పలువురు వక్తలు పాల్గొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ములకలపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. సీహెచ్‌ఓ భద్రమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, నర్సులు పాల్గొన్నారు.



మణుగూరు టౌన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది వాసవి



ములకలపల్లి : మానవహారంతో అవగాహన

మలుపులు.. ప్రమాదాలకు నెలవులు

- ఇరుకుగా వంతెనలు..
- హెచ్చరిక బోర్డులు పెట్టని అధికారులు



కాటాయిగూడెం గ్రామ శివారులో తాలిపేరుపై..



చిన్న ఆర్లగూడెం దగ్గర మలుపులో ఉన్న వంతెన

దుమ్ముగూడెం: నూతనంగా నిర్మించిన మండలంలోని ములకపాడు- చెరుపల్లి రోడ్డులో మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. రోడ్డులో ఎక్కడా కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో సింగల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారి మరమ్మతులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.21.64 కోట్ల నిధులు మంజూరు చేయడంతో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేసిన అధికారులు మరో 3 కిలో మీటర్ల నిర్మాణ పనులకు అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపివేశారు. కాగా ఈ రహదారిలో ఎక్కడ కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తున్నాయి. రోడ్డు నిర్మాణంలో ఎక్కడ కూడ సంబంధిత కాంట్రాక్టర్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాలు కావడంతో రోడ్లపై ప్రజలు ఎక్కువ శాతం తిరుగుతుంటారని, అతివేగం వలన ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారిలో ఉన్న కల్వర్టుల వద్ద ఎలాంటి బోర్డులు పెట్టకపోవడంతో మలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుని మృత్యువాత పడుతున్నారు.

ఇరుకుగా కల్వర్టులు..

కాటాయిగూడెం దాటిన తర్వాత తాలిపేరు కాల్వపై ఉన్న వంతెన ఇరుకు ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఇదే వంతెనపై కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్-ద్వి చక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొని చిన్న ఆర్లగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందిన సంగతి విదితమే. అలాగే కొంగవాగు వంతెన సైతం ప్రమాదకరమైన మూలమలుపు ఇక్కడ అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మండలంలోని ఈ రహదారి గుండా పక్కనే ఉన్న ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రజలు ఎక్కువగా వెళ్తుంటారు. ములకపాడు నుండి మారాయిగూడెం వరకు నిత్యం వందలాది వాహనాలలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఆర్ అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఈ రహదారి తాకిడిని అధికారులు దృష్టిలో పెట్టుకుని వంతెనల వద్ద,మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు పెట్టాలి



ములకపాడు-చెరుపల్లి డబుల్ రోడ్డులో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నిలువరించాల్సి ఉంది. రహదారి వెడల్పుగా ఉండటంతో పాటు చదునుగా ఉండటంతో యువత ఈ రహదారిపై 100 స్పీడ్‌తో వాహనాలు తోలుతూ ప్రమాదాలకు గురి అవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– తొడం తిరుపతిరావు, మారాయిగూడెం సర్పంచ్

అధికారులు చర్య తీసుకోవాలి



ఈ డబుల్ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి ఎక్కడ కూడ హెచ్చరిక బోర్డులు పెట్టక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.అధికారులకు హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించాం ఇంత వరకు వాటిని ఏర్పాటు చేయలేదు తక్షణమే అధికారులు బోర్డులను ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాలి.

– గుండి వెంకటేశ్వర్లు, సర్పంచ్, కొత్తపల్లి

రోడ్డు మొత్తం పూర్తయ్యాక ఏర్పాటు చేస్తాం

ములకపాడు-చెరుపల్లి రహదారి నిర్మాణం మరో మూడు కిలోమీటర్లు అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపి వేసాం పనులు అంతా పూర్తయ్యాక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం. ఈ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే అవకాశం లేనందున వాహన దారులు గమనించి నెమ్మదిగా వెళ్లాలి.

– హరిలాల్, ఆర్అండ్‌బీ డీఈ

క్లుప్తంగా

మిత్రుల చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చంద్రుగొండ : అనారోగ్యానికి గురైన వ్యక్తికి తోటి మిత్రులు చేయూతనందించారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఎం. ఉమామహేశ్వరరావు అనారోగ్యానికి గురవ్వగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ పూర్వవిద్యార్థులు శుక్రవారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ శ్రీనివాస్, కడియాల నాగేశ్వరరావు, యండీ రఫీక్, దార రమేష్, వేణు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చర్ల: చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సత్యనారాయణపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చర్ల సెక్షన్ విద్యుత్ ఏఈ యోహాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

బూర్గంపాడు: జమాతే ఇస్లామే హింద్ ఆధ్వర్యంలో సారపాకలోని మస్జిదే దావత్ మసీద్‌లో నిరుపేద ముస్లిం మహిళలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామే హింద్ పట్టణ అధ్యక్షుడు ఇషాక్ మాట్లాడాను. ఈ కార్యక్రమంలో జహీర్ బాషా, సైదుద్దీన్, ఇబ్రహీం, హఫీజ్, ఇమ్రాన్, షేక్ అబ్దుల్‌సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్లు..



కిట్ పంపిణీ చేస్తున్న యాజమాన్యం

మణుగూరు రూరల్: మండలంలోని గుట్టమల్లారం ప్రాంతంలో గల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయికృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా నాసా కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల అకాడమిక్ డీన్ నరేష్, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ భాస్కర్ రెడ్డి, నాసా ఇన్‌చార్జ్ సింధు, శ్రీదేవి, దామోదర్, అభిరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ



బియ్యం అందజేస్తున్న దాతలు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 బ్లాస్టింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న రొయ్యల శౌరీస్ రాజ్ ట్టిన రోజు సందర్భంగా శుక్రవారం సంతోష్‌నగర్‌లోని బాలవెలుగు పాఠశాలకు 50 కేజీల బియ్యం వితరణ అందజేశారు. సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డీ.నాసర్ పాషా, సత్యనారాయణ, సావిత్రి, రంగారావు, భార్గవి, పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది సుహాసిని, దేవి, చంద్రకళ, రాధ పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి



పూజలు చేస్తున్న మాలధారులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గురుస్వామి సీతారామాంజనేయశర్మ ఆధ్వర్యంలో 37 మంది అయ్యప్ప స్వాములకు ఇరుముడులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.